# కైలాసానికి మెట్లు

సంక్రాంతి పండుగ వెళిపోయింది.

పొలాలు ఖాళీగావున్నాయి. చెరువు గట్టుమీద తుమ్మచెట్లు గాలికి ఊగుతున్నాయి. ఎంతో దూరాన కొండలు.

అరరరే అంటూ పరుగెత్తారు కుర్రాళ్ళు

గోలీ చాలాదూరంగా పోయింది.

"నే నొట్టుకొత్తా నుండండెహె" అని బయల్దేరాడు.

ఒక గోపురం లాంటి రాయికి గుద్దుకుని ఆగింది గోలీ. వంగి గోలీ తీశాడు. ఆ రాయి....అలావుందేమి? రథం పైభాగంలా, దే వు డి కి రీ టం లా ఉంది. గోళీ తెచ్చాడు.

సూర్యుడు పడమర ఆకాశంమీద మెరుస్తున్నాడు. సొమ్ములు పొలాలంట మేస్తున్నాయి. కుర్రగాళ్ళు మామిడిచెట్లకిందకి చేరారు.

"ఏహేయ్ గణపతోయ్ సొమ్ములు కొండకేసి పోతున్నాయి. మళ్లించు"

గణపతి అదేతడవుగా బయల్దేరాడు.గణపతికి పన్నెండేళ్ళు ఎప్పుడో నిండిపోయాయి. పదమూడేళ్ళకి నాలుగో ఐదో నెలలు తక్కువ. బక్కపలచగా నల్లగా వుంటాడు. ఆ వయస్సువాళ్ళమీద సన్నంగా వుండటం చేతనో ఏమో పొడవుగా ఉన్నట్టనిపిస్తాడు. చెవికి బంగారపోగులు, మాసిన నీలంచొక్కా, గోచీ. తలపాగా మాత్రం తలకుమించి చుడతాడు.

"ఇలగుందేటి?" అనుకున్నాడు ఇందాక కనిపించిన రాతిదగ్గిర కూచుని. చుట్టూవెదికి కాస్తసూదిగా వున్న రాయి తెచ్చి తవ్వేడు.

"అబ్బో శానా లోతుంది గావు పోర్లిల బాబు!?"

"స్స-పేణం నాసిగీనట్టయిపోనాది" రాయితగిలి వేలికి రక్తం చిందింది.

ఒక బెత్తెడులోతు తవ్వి వుంటాడు. తలలావుంది. ఇటూ అటూ చెవులాఅ?

"ఓరి గణపతో! అక్కడే వుండిపోనావ్, మర్రావా ఏటి" కుర్రగాళ్ళు పొలి కేకలేస్తున్నారు.

"పారొస్తనను" అనుకుంటు బయల్దేరాడు.

"సేతి కేడి దదీ"

"ఏట్నేదు. ఒల్లకోయ్"

సూర్యుడి రంగు ముదురుతున్నది. అంతా ముందన్నే మళ్లిస్తున్నారు గణపతి బుర్ర ఆలోచిస్తున్నది.

"అదేటయ్యుంటది సెప్మా! ఏటి బోదపట్టంనేదు! దేవతా యిగ్రహంగాని గాదు గందా!"

చెరువులోకి తెచ్చి సొమ్ముల్ని కడుగుతున్నారు-

సూర్యుడి ఎరుపు చెరువునిండా కలిసిపోయింది.

"ఓరి మందలోడా !

ఓరి మాయలోడా!

కాటికి బెట్టే కరెంటి నాగిందో!"

కుర్రిగాళ్ళు పదాలు పాడుతున్నారు

గణపతి అంబలితాగి గాదిదగ్గిర పడుకున్నాడు.అంబలి తాగేడేగాని మనసు అంకింమీద వాలేడు. చుట్టుపక్కలా పశువులు అక్కడక్కడా పశువులు అరుస్తున్నాయి. బేపులు ఏడుస్తున్నాయి.

ఏదోలావుంది. పశువులు గడ్డి తింటున్నాయి. ఎద్దుల మెడలో గంటల చప్పుడు ఎక్కడో కుక్క మొరుగుతున్నది. సాల రాటకి కట్టిన దీపం బిక్కు బిక్కుమంటున్నది. గణపతికి నిద్రిపట్టలేదు.

"దేవతాయిగ్గిలు నానాటోళ్ళకి దొరుకుతాయేటి! నానసలే దరిటప్రుగొట్టు మొగం. మరేటయ్యుంటాదీ?...."

గణపతి పుట్టుక ఎక్కువమందికి తెలీదు. నాగేళ్ళకిత్రం చచ్చిపోయిన ముసల్దానికి బాగాతెలుసు, ఆ ముసల్ది గణపతి అమ్మమ్మ. ఆ ముసల్దాని కూతురు ఒక సిపాయిని చూసి మునుపొగ్గేసింది. అప్పుడే గణపతి పుట్టాడు. గణపతి కడుపున వడ్డవాక తల్లికి చెప్పిందికాదా రహస్యం.అటుతిరిగి ఇటురానా అని ఆ సిపాయి అదేపోవడం పోయాడు. గణపతికి మూడేళ్ళ వయసులోనే తల్లిని పులేసుకుపోయింది. రామతీర్థాలు కేసి పులులు ఈ మధ్య రావడం మానేశాయి. ఆ పులిని వెంటాడి కొట్టడానికి వెళ్ళిన ఇద్దరు రాజులశవాలు నాలోజుల తరువాత దుబ్బుల్లో దొరికాయి. అప్పట్నించి గణపతిని ముసల్దేచూసింది. గణపతి వినాయకచవితిరోజున పుట్టేడట. బతికున్న మూడేళ్ళూ తల్లి-బిడ్డకి ఏ పేరూ పెట్టలేదు. అమ్మమ్మ గణపతీ-అని పిలిచేది. నాలుగేళ్ళయి అదీ చచ్చిపోయింది. నాయుడు గారింట్లో సొమ్ములు కాస్తున్నాడు. కాసిన్ని గంజినీళ్ళు పోస్తున్నారు. మొన్న మొన్ననే ఏరు పుయ్యడం నేర్చుకున్నాడు.సాలుకొయ్యడం మాత్రంతిన్నగారాకుండాఉంది. కాస్త బలంగా ఉన్న బాగుణ్ణు. సేపలకూరా, మాంసమూ తింటే బలమెక్కుతారని. ముసల్ది చెప్పేది.

"మీ నాన్న ఎప్పుడూ కోడిపెట్టలూ, గొర్రెపోతులూ తినేవోడురా! ఎంత జబర్దస్తీగా వుండేవోడనీ! నువ్వెలాపుట్టేవో, ఒంటిపేగు ఎదవ్వి!"అనేది.

గణపతికి నిద్రపట్టలేదు. లేచి పశువులన్నిటికీ గడ్డివేసి వచ్చాడు. బుట్టలోంచి కోడి కుర కుర లాడింది,

"నక్కగిన రాలేదుగంగా! ఎదవగోల! అని కోడిపెట్టినిచూసి, మాళ్లా గంపకట్టేశాడు అంకింమీద వాలేడు. చుట్టుపక్కల అక్కడక్కడా పశువులు అరుస్తున్నాయి బేపులు ఎడుస్తున్నాయి.

"ఎదవ బేపులు అలగరవగూడదంట. తిన్నగా తొంగుడోరాదు!.... ఇంకా సలి తగ్గిందిగాదు." ముణగతీసుకుని పడుకున్నాడు.

నల్లటిఆకాశంలో చుక్కలు చమక్కుమంటున్నాయి. చీకటితోనేలేచి సాలంతా తుడిచేడు. పశువులన్నిటికీ తాడూ, ఉప్పూ కుడితీ కలిపిపెట్టాడు. ఆవుల దగ్గిరికి వెళ్ళి పెసరుబ్బా, చిన్న తెలగపిండిరవ్వా వేసి మేతపెట్టాడు. ముంతలు దీసుకుని పెయ్యల్ని విప్పడానికి బయల్దేరాడు. మనసు మాత్రం కొండ దగ్గిరికి పోదామా అని వుంది. పనులన్నీ అయ్యి ఎండెక్కేక దప్పికదాగి సొమ్ములిప్పాక బయల్దేరాడు. విరిగిపోయిన గడ్డపలుగు ముక్క పట్టుకున్నాడు.

అయ్యయ్యో.... పైకి కనిపించే భాగం విరిగిపోయింది. రాత్రి భూకంపానికి పెద్దరాయి దొర్లి దానిమీదపడి కిరీటంలా కనిపించేది విరిగిపోయింది, ఒళ్ళంతా చెమటలెక్కి పోతూంది. కాని మనసులో ఏదోమంటలా వెలుగుతూంది. ఆ బక్క ప్రాణంలో గొప్ప ఉద్వేగం ఉంది.

"గ....ణ....ప....తి"

సరిగ్గా మూరెడు ఎత్తులో ఉన్న గణపతి బొమ్మ! తాజ్‌మహాల్ పూర్తి అయ్యాక షాజహాన్ పొందిన ఆనందం!

"దీన్ని బాగా కడగాల....ఎలగ? ఈ ఎదవలు సూస్తే గొల్లు పెడతారు"

"ఎక్కడికిరా పోయేవు?"

"నా నెటెల్లేను?"

గణపతి లోపల హోమం వేసినట్టయింది. మనసులో చిత్రమయిన ఆలోచనలు. నిజంగా తనకి దేవతావిగ్రహం దొరికింది. ఎంతో పుణ్యంచేస్తేగాని దొరకదట. తనేం పుణ్యం చేశాడు? ఒన్ అమ్మా... అబ్బా....? ఐనా తనకే ఎందుకు దొరకాల?....

"ఓరి సిమ్మా సెలమో....నువ్వు పదరా! ఒక్క సిటంలో ఎల్లిపొత్తాను"

"మళ్ళెటురా ఎదవా?"

"బాబు గదు! కసింత సొమ్ములు సూస్తుండు .. ఇప్పుడెలిపొత్తాను"

సొమ్ములు ఊరివేపు బయల్దేరాయి. సిమ్మా సెలంగేదెమీద కూచుని పదం ఎత్తుకున్నాడు. దుమ్ము రేపుతూ సొమ్ములు నడుస్తున్నాయి. మిగతా కుర్రకారు

సిమ్మాసెలం పదాకివి పంత పాడుతున్నారు.

"నోము నోమల్లాల తుమ్మెదలో"

గణపతి బొమ్మ భుజానికెత్తుకున్నాడు. బరువుగానే ఉంది. నీటిలో బాగా కడిగేడు రాయి మంచిదోకాదో గణపతికి తెలియదు. దానిరంగు కాస్త నలుపని తెలుసును ''ఛస్.... కిరటం ఇరిగిపోనాది.... ఏదో అపరాదం జరిగుంటది. రేపు అరటిపండు దెచ్చి నవేజ్జమెట్టాల....''తొండం బొజ్జమీద వంపుతిరిగింది గుండ్రని బొజ్జ. చేతుల్లో ఉండ్రాళ్ళు. నాలుగు చేతులు. ఒక దంతం. బొజ్జకి అడ్డుగా నాగుపాము. బొడ్డు ఏం కుదురుగా ఉన్నదీ! చిన్న ఎలక! ఎంత బాగుదెంతబాగుంది!

రాతిని అతకడన వీలవుతుందా? ఎక్కణ్ణుంచి తీశాడో అక్కడికి తీసుకెళ్లాడు రాళ్ళు చుట్టూ పేర్చి చిన్న గుహలా చేశాడు. ఆ మధ్యన గణపతిబొమ్మ పెట్టేడు మామిడి కొమ్మలు తెచ్చి చుట్టూ గుచ్చాడు. విరిగిపోయిన కిరీటం ఒక్కటే మచ్చలావుంది. కడివెడు పాలల్లో ఒక్క విషపు చుక్క వాలు.

"నాయినా, గణపతి, నాకేటి తెల్దు. అపరాదముంటే కాయి తండ్రీ. నీకు వంద వెయ్యి దండాలు మొక్కుతాను స్వామీ"

తలపాగా బిగించి పరుగందుకున్నాడు.

"ఊరంత తిరిగింది–గోంగూరకే
వాడంత దిరిగింది–గోంగూరకే
కొండంత దిరిగింది–గోంగూరకే''

పదాలు వినిస్తున్నాయి. ఊరుచేరువయింది. మరి నాలుగడుగులువేస్తే రాజుగారితోట దాటితే ఊరే. నలుగురిడోనూ కలిసిపోయాడు.

''ఎటు పోనావురా ఎదవా'' అని పలకరించాడు సిమ్మాసెలం.

"ఎటు నేదురా....యెలిపోచ్చినాను గంద''

సొమ్ములు ఊళ్లో ప్రవేశించాయి. అందరూ తలో మూలా పోయారు. సిమ్మాసెలమూ గణపతీ మిగిలేరు.

''ఒరే సిమ్మాసెలమో, ఒకటడుగుతాను సెప్పాలా?''

''ఏట్రదో''

''మరేట్నేదు. రాళ్ళు అతకడం ఎప్పుడయినా చూశావేంట్రా?'

'సూపునేదు గానీ ఇన్నాను. సున్నమూ–బెల్లమూ కలిపి అంటిత్తారంట'

'నిజిమా'

'ఒరి యెదవా బొంకవొలిసిన అవసరం నాకేటే'?

ఆ మాట వినకుండానే సొమ్ముల్ని మళ్ళించుకుని బయల్దేరాడు గణపతి.

'గణపతీ ఇయ్యాల పొద్దోయిందేరా?' అనడిగింది నాయురాలు'

"నేదే, నలుగురితోటే పారొచ్చినాను"

గణపతి ఊహనిండా గణపతి విగ్రహం.... గణపతికి తనని ఎవరూ ప్రేమించడంలేదని తెలీదు. ఆ ఊహేరాదు. చూసేవాళ్లెవరన్నా 'పాపం' గణపతి అనుకోవాలి తప్ప ఆ కుర్రాడికి ధ్యాసలేదు. అయితే గణపతిని అతిమిక్కుటంగా ప్రేమించేది అమ్మమ్మ. ఆ ముసల్ది చచ్చిపోయింది. ఆవిడ చచ్చిపోయే నిమిషానికి గణపతి దగ్గరలేడు. శవాన్ని చూసి గణపతికి ఏడుపు రాలేదనే చెప్పాలి. నాలుగు రోజులతరవాత మాత్రం పేగులు తెగిపోయేలా ఏడిచాడు. అప్పుడూ తోచిందిగాదు మరి తనని అభిమానించేవారు లేరని. రెండూపూట్లా తడుముకోకుండా గుక్కెడు గంజి దొరుకుతుంది. యింకేం కావాలి? పడుకోబోయేటప్పుడు అమ్మమ్మ చాలా కబుర్లు చెప్పేది. అన్నీ వినేవాడు. ఏమీ ప్రశ్నలు వేసేవాడు కాదు. దేవతా విగ్రహాలు దొరికితే ఎంతోపుణ్యమని చెప్పడం బాగా జ్ఞాపకం వుంది. రాత్రంతా ఆలోచిస్తూ పడుకున్నాడు. దేవతా విగ్రహాలు బలి కోరతాయట! మరి — ఆ నోటితోనే అమ్మమ్మే దేవుళ్లు మంచివాళ్లని చెప్పింది. అంతా తిరకాసుగా వుంది. సున్నమూ బెల్లమూ సంపాదించాల. మర్నాడు వెళ్లేసరికి అంతా చిందరవందరగా వుంది. యే నక్కలో తిరగదోయిన్నివుంటాయి.

"అమ్మో! కిరీటం ముక్క!" దానికోసం చాలా వెతకవలసొచ్చింది. రేపెలాగయినా సంపాదించాలి, సున్నమూ బెల్లమూను. ఆ సిమ్మాసెలాన్ని పట్టుకుంటే పనౌతాది. ఎండిపోయిన ఆకులు పారేసి మళ్లీ రాళ్లు చక్కంగా పేర్చాడు. నిన్నటిరోజున అరటిపండు దెచ్చి నైవేద్యమెడతానన్నాడు. "అపరాదం సామీ" అని మోకాళ్లమీద కూచుని తలవొంచి లెంపలు వాయించుకొని దణ్ణం మొక్కేడు. మరినాలుగు రోజుల్లో శివరాత్రి. రామతీర్థాలు కాడ తీర్థం.

"శివశివమూర్తివి గణనాథా
నీవు శివుని కుమారుడివి గణనాథా"

గణపతి బుర్రలో ఆలోచనలు ముసురుతున్నాయి. తనకి దొరికిన గణపతి బొమ్మకి అలాటి కోవిల కట్టించాల. అలాటి వేడుక జరగాల.

"ఏరా గణపతీ తిండికి రాలేదేట్రా"

"ఏట్నేదు"

గణపతి మనసులో, పదమూడేళ్లు నిండని పసిగుండెల్లో మండుతున్న మంట ఎవరికి తెలుస్తుంది?

"అప్పల్నాయుడా! నాకేటి బోదపడ్డం నేదు. మనోడు రోజుకీ ఎటో పోతండు. యీపొద్దూ పోయాడు" అన్నాడు సిమ్మాసెలం.

''ఎలగో సప్పనిద్దూ'' అన్నాడు అప్పలాన్నాయుడు.

రోజులు గడిచిపోతున్నాయి. ఎండలు బాగా ముదిరిపోతున్నాయి. రాను తీర్థాలు యాత్రి – ఏం జనం! ఏం జనం! తనకి దొరికిన గణపతి బొమ్మకి అలాటి యాత్రి జరగాల! అదీ–!

''గణపతీ! యిటు జూడొరే! మనసులో యిడుకోకంట సెప్పే మరేల. ఎట్రా ఎల్తన్నావ్ రోజుకున్నూ?''

గణపతి కళ్లు బలబల్లాడాయి. ప్రవహిస్తున్న కెరటాలు ఆగిపోయి నిమిషం తళుక్కుమన్నాయి.

'సిమ్మాసెలమా నాకేం తెలదు కాని యీ బూమ్మీద పుట్టినంక ఏటన్న సెయ్యాల అనేదిరా మా యమ్మమ్మ, నాకదే వుండిపోనాది కడుపులో....''

''అయితే నువ్వేటి సేద్దామని?'' కుర్రిగాళ్ల కేకలు.

''ఒకరోజున నన్నడిగేడు రాళ్లు అంటించడం సూశావా అని'' అన్నాడు సిమ్మాసెలం.

పదిమందీ కొండవైపు నడుస్తున్నారు. సిమ్మాసెలం ముందు నడుస్తున్నాడు

* * *

''రోజుకీ ఎటో పోయీవోడు. నిన్నటొర్జున నానడిగినాను, ఏటీ మనసులో యిడుకోకంట సెప్పే అంగని. బూమ్మీద జలమెత్తినంక ఏటన్నా సెయ్యాలనేది మా యమ్మమ్మ, నాకదే కడుపులో వుండిపోనాదన్నాడు. అయితే నువ్వేటి సేస్తా వనడిగేను. ఇదిగో అంతలో యీ యెదవలు గొల్లు పెట్టినారు''

రక్తం మరకలు....! మరి నాలుగు రాళ్లు దాటేరు.... గణపతి! ఓల్నాయనో అని కేక పెట్టాడు సిమ్మాసెలం. కుర్రిగాళ్లంతా చుట్టూ చేరారు. గణపతి చచ్చిపడి వున్నాడు. వొళ్లంతా చీరేసివుంది. కళ్ళు కొండవైపు చూస్తున్నాయి. ఒకటి రెండు పేగులు బయిటికి వేలాడుతున్నాయి-మెట్లు-కొండమీదికి రాతిపేర్పు-

''ఎలుగ్గొడ్డో ఏదో సీరీసుంటాది''

''పొగులు ఎలుగ్గొడ్లొత్తయ్యా?''

''రేతిరి కాడే''

''మరీడు రేతిరి కాడ యిటొచ్చినాడంటావు?''

''మరేటీ కానరాటం లే?''

అంతా మెట్లెక్కుతూ బయలుదేరారు. ఎంతోమంది నిర్విరామంగా శ్రమిస్తేనేగాని జరగని రాళ్లపేర్పు. మలుపులు ఎక్కుతున్న కొద్దీ ఆశ్చర్యమైపోయింది.

''ఇదంత యెవుడు సేసినాడంట?''

"మనోడే–రోజుకీ వొచ్చేవోడు" అన్నాడు సిమ్మాసెలం.

"వోళూ? గణపతే?"

"మరేటి??"

"అయితే ఈ పావంచాలన్నీ యీడే కట్నాడంటావు?"

"అఁ అఁ! మరేటంతన్నన్ను"

"యేటీ బోదపడ్డంనేదు"

"అప్పల్నాయుడా! అల్లట్లు కాస్నాడు. అదేటొరే?"

"పద పదమీ"

"యేదో బొమ్మనాగుందిరా"

"ఆ మాయిడాకు లేల?"

అక్కడ గణపతిబొమ్మ. సాపయిన రాతిమీద పెట్టి ఉంది.

"ఇది గోటి నాన్‌జెప్పనేదూ? నన్నడిగినాడు మన్నం"–అని గణపతిబొమ్మ కిరీటం దగ్గిర అంటింపు చూపించాడు సిమ్మాసెలం. అంతా పట్టి చూశారు.

"సిత్రిం గుంది"

"ఇంతోడు యంత పన్జేసినాడు!?"

"కయిలాసానికి కట్టినట్టు కట్టేనాడు సీడీలు"

అంతా అక్కడ తిరిగినంతసేపు తిరిగారు. ప రి స రా లు పరిశుభ్రంగా ఉన్నాయి. తరువాత నింపాదిగా మెట్లుదిగిపోయేరు.

దిగువ గణపతి చచ్చిపడున్నాడు.

అతని కళ్ళు మెట్లవైపే చూస్తున్నాయి.

గ్రంథ నిలయం శ్రీకాకుళం 3686

రచన: 1967 ఏప్రిల్ ప్రాంతం

ప్రచురణ : 1] ఆంధ్రప్రభ, వారపత్రిక, 5-3-69 [కథలపోటీలో బహుమతికి స్వీకరించబడిన కథగా ప్రచురితం]

2] నవీన కథామాల, ఉత్తరాంధ్ర గ్రంథమాల [విజయనగరం] ప్రచురణ, (1968 ఏప్రిల్‌లో) చేరింది.